లిఫ్ట్‌లకు మరమ్మతులు

డబుల్ ఇళ్లవాసుల హర్షం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ఎమ్మెల్యే గాంధీ చొరవతో నాలుగు లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏడాది వరకు లిఫ్ట్ నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని గాంధీ స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా డబుల్ ఇళ్లవాసులు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారని ఆయన పేర్కొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం



మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన తాపీ మేస్త్రీలు

గచ్చిబౌలి: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణ ప్రక్రియ చేపట్టవచ్చని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కొండాపూర్‌లో మాదాపూర్ స్టీల్ హౌస్ డీలర్‌షిప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. అల్ట్రాఫాస్ట్ పిల్లర్లు, స్లాబ్‌లు, బ్రిడ్జీ, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులకు భారతి సిమెంట్ ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తుందని భారతి సిమెంట్ డీలర్ నర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలోమార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



ఆదర్శనగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో..



రాయదుర్గం మండపం వద్ద దుర్గాదేవికి కరెన్సీ అలంకారం



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



రాయదుర్గంలో.. దుర్గాదేవికి గాజుల అలంకారం



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో.. పెద్దమ్మ, మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకారం

నవరాత్రి వేడుకలు..
మహాలక్ష్మిగా దుర్గాదేవి



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో.. మహాలక్ష్మీగా రాజరాజేశ్వరీదేవి

శరన్నవ రాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కాలనీలు, బస్తీలలో మంగళవారం అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల వద్ద కుంకుమార్చనలు, లక్ష్మీ, విష్ణు సహస్రనామ పారాయణాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. – గచ్చిబౌలి/రాయదుర్గం



రాయదుర్గంలో.. కుంకుమార్చన చేస్తున్న మహిళలు



రాయదుర్గం శ్యామ్‌లేట్ వీధిలో..



ఖాజాగూడ సాయిఐశ్వర్య కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



రాయదుర్గంలోని శ్యామ్‌లేట్‌వీధిలో..



మియాపూర్‌లో.. అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే గాంధీ, నాయకులు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో బుధవారం రూ.5.27 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్ శంకుస్థాపనలు చేయనున్నారు. శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రూ.15 లక్షల సీసీ రోడ్లు, రూ.17.25 లక్షల ప్రహరీగోడ నిర్మాణం, పాపిరెడ్డి కాలనీ నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు రూ.63 లక్షల వ్యయంతో లింక్‌రోడ్డు నిర్మాణం, సెంట్రల్‌పార్క్ ఫేజ్–1లో రూ.50 లక్షల వ్యయంతో సీసీరోడ్డు, ఫేజ్–2లో రూ.50లక్షల సీసీ రోడ్డు, ప్రేమ్ నగర్ బీ బ్లాక్‌లో రూ.45 లక్షలతో సీసీరోడ్డు, ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌లో రూ.50లక్షల సీసీరోడ్డు, సఫారీనగర్‌లో రూ.32 లక్షల సీసీ రోడ్డు, దర్గా నుంచి పంచవటికాలనీ రూ.39 లక్షలతో చేపట్టే బాక్స్ కల్వర్ట్ నిర్మాణం, కేశవనగర్‌లో రూ.49.55 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి వీకర్‌సెక్షన్‌లో రూ.49.60 లక్షలతో సీసీరోడ్డు, అవంతిక గోదావరి కాలనీలో రూ.49.75 లక్షలతో సీసీరోడ్డు పనులను చేపట్టనున్నారు.

వినతి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రాయదుర్గంవాసులు

రాయదుర్గం: బతుకమ్మ వేడుకల నేపథ్యంలో రాయదుర్గంలోని మలకంచెరువులోని కోనేరు వద్ద ఏర్పాట్లు చేయాలని శేరిలింగంపల్లి సర్కిల్, వెస్ట్‌జోన్ కార్యాలయంలో రాయదుర్గంవాసులు వినతిపత్రం ఇచ్చారు. కోనేరు వద్ద లైట్లు, నీటి సౌకర్యం, నిమజ్జనానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరగా అధికారులు ఏర్పాట్లు చేయిస్తామని హామీ ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత



సీఎంఆర్‌ఎఫ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌కు చెందిన సయ్యద్ అజహర్ అలీ అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.2.50 లక్షల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం అలీ కుటుంబ సభ్యులకు అందించారు. నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు

అలరించిన ఒడిస్సీ నృత్య ప్రదర్శన





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం మైథిలి కిదాంబి శిష్య బృందం వీణ కచేరి ఆకట్టుకుంది. కళాకారులు శారద, సాహితి, మహతి, మనస్విని, మనోజ్ఞ, అలేఖ్య, మిహిర్ పాల్గొన్నారు. అలాగే బెంగుళూరికి చెందిన భరతనాట్య కళాకారులు హేమబృందం తమ ప్రదర్శనతో అలరించారు. కళాకారులు హర్షిత, ముక్తలు ప్రదర్శించిన అంశాలు గణేశకృతి, నంది చోళం, చాముండేశ్వరీ, దేవీ స్తుతి, దేవీ కృతి, నటనం, ఆదినార్, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. సుశ్మిత మిశ్ర శిష్యబృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాద బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిహాల్ గానం సందర్శకులను ఆకట్టుకుంది. గజల్ ఆలపించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఒలింపిక్ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలచారి హాజరై అభినందించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం బహూకరణ



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తలు వాడ్యాల భాస్కర్‌రెడ్డి, శ్యామల దంపతుల కుమార్తె సుష్మ రంజిత్ రెడ్డి దంపతులు మంగళవారం 100 కేజీల అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఆలయ ధర్మకర్తకు అందజేశారు.

డీజేకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఏసీపీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐలు, డీఐ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ శ్రీనివాసరావు మంగళవారం డీజే షాపుల యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పీఎస్ పరిధిలోని 4 స్టేషన్‌ల పరిధిలో సుమారు 30 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతాల వారీగా నిర్దేశించిన డెసిబుల్స్‌లో డీజే ప్లే చేయాలని సూచించారు. డీజే ప్లే చేయాలంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అనుమతి పొందాలని చెప్పారు. కూకట్‌పల్లి సీఐ ముత్తు, డీఐ వెంకటేశ్వర్లు, అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి, కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న, బాచుపల్లి డీఐ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ ఒప్పందం



టీహబ్‌లో సీఈఓ శ్రీనివాసరావుతో సమావేశమైన ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్ హెడ్ సోని మహంతి

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ మంగళవారం ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా భారత్‌లో వెబ్ 3 స్టార్టప్‌ల కోసం బ్లాక్ చెయిన్ ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయనున్నారు. అంతకుముందు టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావుతో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్, ఎకో సిస్టమ్ బిల్డింగ్ హెడ్ సోని మహంతి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో మా భాగస్వామ్యం భారతీయ స్టార్టప్‌లకు కొత్త ఆవిష్కరణలు, గణనీయమైన మార్పును తీసుకురావడానికి అవసరమైన సాధనాలు, మద్దతును అందిస్తుందని చెప్పారు. సోని మహంతి మాట్లాడుతూ భారత్‌లో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వినియోగ విస్తరణకు టీహబ్‌తో మా భాగస్వామ్యం ఒక ప్రధాన మైలురాయి అని పేర్కొన్నారు.

స్వచ్ఛ నగరంగా మార్చడమే లక్ష్యం



పర్వత్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు

జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి

మాదాపూర్: నగరాన్ని స్వచ్ఛనగరంగా మార్చడమే 90 రోజుల కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో 90 రోజుల పాటు చేపట్టిన డీసిల్టింగ్ మ్యాన్‌హోల్ కవర్స్, డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మాదాపూర్‌లోని పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద జరుగుతున్న పనులను సిబ్బంది, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మ్యాన్‌హోల్ కవర్స్ అన్ని చోట్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు పలు ఫిర్యాదులను పరిష్కరించినట్టు తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



ఎమ్మెల్యే గాంధీని కలిసిన అవంతిక హోమ్స్ కాలనీవాసులు

రాయదుర్గం: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. సీసీ రోడ్లు మంజూరు చేసిన నేపథ్యంలో గచ్చిబౌలి డివిజన్ అవంతిక హోమ్స్ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు ,బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, సురేష్ నాయక్, శ్రీనివాస్, పింటు, రాకేష్, రాజేందర్, కిరణ్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించే లక్ష్యంతో నిజాంపేట్‌లోని కొలను నారాయణరెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాలులో చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళాసిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోచంపల్లి చీరలు, బెడ్‌షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాని శారీస్, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికన్‌వర్క్ కుర్తీస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 27వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

'మురుగు' పనులు మరిచిపోయారా ?





అసంపూర్తిగా ఉన్న వైశాలీనగర్ - ఈర్ల చెరువు మురుగు నీటి కాలువ పనులు

- వైశాలినగర్– ఈర్ల చెరువు వరకు పెండింగ్
- వర్షం పడితే వైశాలినగర్‌లోకి మురుగు నీరు
- పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వినతి

చందానగర్: చెరువులలో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా డ్రైనేజీ కాలువ పనులు చేపట్టారు. అందులో భాగంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్ నుంచి ఈర్ల చెరువు మీదుగా మదీనాగూడ వైపు జరుగుతున్న కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కాలువ పనులు నేటికీ పూర్తికాకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కాయిదమ్మకుంట నుంచి గురునాథం చెరువు వరకు 70 శాతం పనులు పూర్తికాగా, మదీనాగూడ ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ వరకు కాలువ పనులు పూర్తయ్యాయి. కానీ వైశాలినగర్ నుంచి ఈర్ల చెరువు వరకు చేపట్టిన కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే మురుగునీరు వైశాలీనగర్‌లో చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సుమారు రూ.7.41 కోట్లతో మురుగు నీటి కాలువ పనులు చేపట్టారు
- మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, మై హోం మంగళ



వెశాలీనగర్ వద్ద మురుగు నీటి కాలువలో చెత్త చెదారం, చెట్ల కొమ్మలు

నుంచి మురుగునీరు ఈర్ల చెరువులోకి వస్తుంది. చిన్నపాటి వర్షం వస్తే చాలు రైల్వే అండర్ బ్రిడ్జి, వైశాలీనగర్‌లోకి మురుగునీరు చేరుతున్నాయి.దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు.

- భారీ వరద వస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు నిలిచిపోతాయి. వెంటనే అధికారులు పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



వైశాలీనగర్ వద్ద చేపట్టిన మురుగు నీటి కాలువ మళ్లింపు పనుల్లో ఆలస్యం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేయాలి. – పార్థసారథి, కాలనీవాసి

త్వరలోనే పూర్తి చేస్తాం



మురుగు నీటి కాలువ మళ్లింపు పనులు కొంతమేర మిగి లి ఉన్నాయి. ఎప్పటికప్పు డు పనుల పురోగతిని పరిశీలిస్తున్నా. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.

– ఎమ్మెల్యే గాంధీ

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు భవన్స్ విద్యార్థిని



విద్యార్థిని హానీషాతో ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి

సంగారెడ్డి: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు బీహెచ్‌ఈఎల్ భారతీయ విద్యా భవన్స్ విద్యార్థిని హానీషా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రీ తెలిపారు. సెప్టెంబర్‌లో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 20–22 కేజీల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు పేర్కొన్నారు. 9 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న హానీషాను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెడ్ మిస్ట్రెస్ భాను నిర్మల, పీఈటీ విభాగం అభినందించారు.

మందుబాబుల వీరంగం

గచ్చిబౌలి: కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలోని ఓ వైన్ షాపు ముందు మందుబాబులు వీరంగం సృష్టించారు. నడిరోడ్డుపై రాళ్లతో పరస్పరం దాడి చేసుకుంటుండడంతో వాహనదారులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘర్షణకు దిగిన వారి వివరాలు సేకరించారు. పోలీసుల రాకను పసిగట్టి అక్కడి నుంచి మందుబాబులు ఉడాయించారు. బొటానికల్ గార్డెన్‌ను ఆనుకొని ఉన్న వైన్ షాపు ఎదుట ఖాళీ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారు. నిత్యం మందుబాబులు గలాట చేయడంతో అటుగా వెళ్లే పాదచారులు బిక్కుబిక్కుమంటున్నారు.



'గో ఫర్ నేచర్'

హెచ్‌సీయూలో ఆదివారం నిర్వహించిన ఎక్స్‌ప్లోరర్స్ టెంపుల్‌రాక్ వాక్‌లో విద్యార్థులు

తప్పిపోయిన బధిర బాలుడి ఆచూకీ లభ్యం

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్రో స్టేషన్ దగ్గర ఆడుకుంటూ తప్పిపోయిన బధిర బాలుడి ఆచూకీని మియాపూర్ పోలీసులు కనుగొన్నారు. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన మహేష్ కుమారుడు లక్కి(9) ఈ నెల 2వ తేదీ మెట్రో స్టేషన్ దగ్గర ఆడుకుంటూ తప్పిపోయాడు. తండ్రి మహేష్ 5వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ అధికారి ప్రవీణ్, మియాపూర్ ఎస్‌ఐ మాణిక్యం బృందం బాలుడి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నగరంలోని బధిరుల హాస్టళ్లలో ఆరా తీశారు. ఈ క్రమంలో మంగళవారం కూకట్‌పల్లి చైల్డ్ వెల్ఫేర్ ఆశ్రమంలో ఉన్నట్లు గుర్తించారు. బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు

చర్యలు తీసుకోవాలని డీసీ మోహన్‌రెడ్డికి వినతి



డీసీ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చందానగర్: అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందంటూ జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చందానగర్‌లో ఓ ఆస్పత్రి వద్ద అక్రమ నిర్మాణాలు చేసి, రోడ్డును కబ్జాచేసి, పార్కింగ్ స్థలం లేకుండా స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులకు గురిచేస్తున్న ఆస్పత్రి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలన్నారు. డీసీ మాట్లాడుతూ త్వరలో కబ్జాలపై చర్యలు తీసుకుంటామన్నారు.